

పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

'కరువు'పై తాత్సారం



తూతూ మంత్రంగా కరువు మండలాల ప్రకటన

- ఉమ్మడి జిల్లాలో 15 మండలాలకే చోటు

- 10 మండలాల్లో తీవ్ర కరువు.. 5 మండలాల్లో మధ్యస్థం

రబీ 2024-25కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. అందులో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి 15 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. వాటిలో 10 మండలాలను తీవ్ర కరువు మండలాలుగా, ఐదు మండలాలను మధ్యస్థ కరువు మండలాలుగా పేర్కొన్నారు. జిల్లాలో సగానికిపైగా మండలాల్లో కరువు ఛాయలు నెలకొన్నా తక్కువ మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించడంతో రైతన్నల్లో ఆవేదన వ్యక్తం అవుతోంది..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. వర్షపాతం, పొడి వాతావరణంతో పాటు సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని 2024-25 రబీ సీజన్‌లో కరువు మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. జిల్లా కలెక్టర్లు పంపిన ప్రతిపాదన మేరకు ఈ నెల 28న వర్చువల్ ద్వారా సమావేశమైన కరువు ప్రభావ కమిటీ ఆరు జిల్లాల్లో 37 మండలాలను కరువు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో 5 మండలాలు ఎంపిక చేస్తూ రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే జిల్లా పశ్చిమ మండలాల్లో తీవ్ర కరువుతో తల్లడిల్లుతున్న పలు మండలాలకు ఈ జాబితాలో చోటు దక్కలేదు. రెండో విడతలోనైనా ఎంపిక చేయాలని రైతులు కోరుతున్నారు. కర్నూలు జిల్లాలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1,17,288 హెక్టార్లు. గత ఏడాది 2023-24 రబీలో 94,391 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తే ఈ ఏడాది 2024-25 రబీ సీజన్‌లో 87,320 హెక్టార్లలో సాగు చేశారు. సాధారణం కంటే 29,968 హెక్టార్లు సాగు తగ్గింది. ఆహార ధాన్యాల (ఫుడ్ గ్రైన్స్) పంటలు 18,176 హెక్టార్లకు గానూ 19,548 హెక్టార్లలో సాగు చేశారు. పప్పు దినుసుల పంటలు 69,958 హెక్టార్లకు గానూ 43,345 హెక్టార్లలో సాగు చేశారు. సాధారణం కంటే 38 శాతం తక్కువ సాగు అయ్యింది. నూనె గింజల (ఆయిల్ సీడ్స్) పంటలు 16,081 హెక్టార్లకు గానూ 9,104 హెక్టార్లలో సాగు చేశారు. ఈ పంటలు కూడా సాధారణం కంటే 43 శాతం తక్కువ సాగు చేశారు. ఉద్యాన పంటలు 6,853 హెక్టార్లకు గాను 5,681 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. సాధారణం కంటే 17 శాతం తక్కువ సాగు చేశారు. అన్ని రకాల పంటలు పరిశీలిస్తే సాధారణం కంటే 26 శాతం తక్కువ సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. అదే క్రమంలో వర్షపాతం కూడా రబీలో సాధారణం కంటే తక్కువే నమోదు అయ్యింది. పలు మండలాల్లో కనీస వర్షపాతం కూడా నమోదు కాలేదని అధికారులు అంటున్నారు. కరువు మండలాల ఎంపిక కోసం భారత ప్రభుత్వ మాన్యువల్-2016 మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి ఇచ్చిన నివేదిక ప్రకారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. పరిశీలించిన కరువు కమిటీ సిఫారసు మేరకు అత్యంత తీవ్ర కరువు మండలాలుగా ఆస్పరి, కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, ఓర్వకల్లు, గూడూరు, కోడుమూరు, వెల్దుర్తి మండలాలను ఎంపిక చేశారు. పత్తికొండను మధ్యస్థ కరువు మండలాల జాబితాలో చేర్చారు.

నంద్యాల జిల్లాలో కూడా పలు మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కెసి కెనాల్, ఎస్‌ఆర్‌బిసి, తెలుగుగంగ, గాలేరు నగరి కాలువల కింద సాగునీటి వసతి ఉన్న మండలాలు కాకుండా ఇతర మండలాల్లో కరువు తీవ్రత అధికంగానే ఉంది.తీవ్ర కరువు మండలాల జాబితాలో కొలిమిగుండ్ల మండలాన్ని మాత్రమే ఎంపిక చేశారు. సాధారణ కరువు మండలాలుగా బేతంచర్ల, బనగానపల్లె, సంజామల, ఉయ్యాలవాడ మండలాలు ఎంపిక చేశారు. డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో వర్షాధారంగా జీవనం సాగించే మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నాయని, వాటిని కూడా ఎంపిక చేయాలని రైతులు కోరుతున్నారు.

రూ.103.30 కోట్ల పింఛన్ల పంపిణీ

- ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా కింద 238302 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.103.30 కోట్లు మంగళవారం ఏప్రిల్ మాసానికి సంబంధించిన పెన్షన్ నగదు అందజేశారు. మంగళవారం ఉదయం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా నగరంలోని సాయిబాబా సంజీవ నగర్‌లో అరుణ జ్యోతి, శంకరమ్మలకు వితంతు పింఛన్లు, దేవర్ల నరసింహులు, భీమక్క, లలితాబాయి, రాగప్పలకు వృద్ధాప్య పింఛన్లను వారి ఇంటి వద్దకే వెళ్లి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా దేవర్ల నరసింహులకు వృద్ధాప్య పెన్షన్‌ను అందచేస్తూ కలెక్టర్ వారి కుటుంబం, పిల్లల గురించి అడిగి తెలుసుకున్నారు.. అతని ఇల్లు సరిగా లేకపోవడంతో ఇంటిని నిర్మించు కునేందుకు అతని నుండి దరఖాస్తు తీసుకోవాలని సంబంధిత సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. ఎవరికైనా ఇల్లు లేకపోయినా, గుడిసెలో ఉన్నా, ఇల్లు సరిగా లేకపోయినా, అలాంటి వారికి ఇల్లు మంజూరు చేసేందుకు దరఖాస్తులు తీసుకోవాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు , కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై న్యాయ విచారణ అవసరం

- దళిత , క్రైస్తవ సంఘాల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

దళిత, క్రైస్తవ సంఘాల అధ్వర్యంలో పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతికి నిరసనగా కోడుమూరు పాత బస్టాండ్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ దగ్గర నిరసన ప్రదర్శన చేశారు. కోడుమూరు మండలంలోని అన్ని గ్రామాల నుండి దళితులు , క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దళిత సంఘాల నాయకులు ఆంధ్రయ్య, పులకుర్తి ఇమ్మానియేలు, కల్లపరి మనోహర్, నాగేష్, రాజు, సుందరమయ్య, అనంతరత్నం, మల్లయ్య, , పాస్టర్స్ కె. మహిమ రాజు, గూడూరు యోహాను, భాస్కర్, సామెల్, షారోన్ కుమార్, మత్తయ్య, సునీల్ కుమార్, యిర్మీయా, బోయాజ్, రాజేష్, రాజు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి పై న్యాయ విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు. పాస్టర్లపై, క్రైస్తవులపై, క్రైస్తవ సంఘాలపై, సువార్తీకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కూటమి ప్రభుత్వంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న నాయకులు

ముగిసిన పది పరీక్షలు

- పరీక్షా కేంద్రాలను కలెక్టర్ పరిశీలన - నేటి నుండి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పదవ తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ముగిసాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా విద్యాశాఖ అధికారులు పరీక్షలను నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలో మంగళవారం నిర్వహించిన సోషల్ స్టడీస్ పరీక్షకు 33420 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 31990 మంది విద్యార్థులు హాజరయ్యారు. 430 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. కర్నూలు నగరంలోని స్థానిక దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ పాఠశాల పరీక్షా కేంద్రంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అక్కడ పరీక్ష నిర్వాహకులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. బుధవారం నుండి కర్నూలు నగర శివారులోని బి.తాండ్రపాడు సమీపంలోని క్రీడో పాఠశాలలో జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ వెల్లడించారు. ఈ మూల్యాంకనం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలను నిర్వహించామని ఆయన వెల్లడించారు.

పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

లీకేజీలను పరిశీలిస్తున్న నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు

పైప్‌లైన్ లీకేజీలకు వెంటనే మరమ్మతులు

- నగరపాలక కమిషనర్ రవీంద్ర బాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడితే జాప్యం చేయకుండా వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వీకర్ సెక్షన్ కాలనీ, పెద్దపాడు రహదారి ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీలను పరిశీలించారు. వేసవికాలం ప్రారంబమైనందున తాగునీటి వృథా అరికట్టాలని, నగర ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు త్వరితగతిన తీసుకోవాలని కమిషనర్ అధికారులను సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలో పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడితే అక్కడి స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని, నీటిని పొదుపుగా వాడుకుంటూ, నీటి వృథాను అరికట్టేందుకు సహకరించాలని కమిషనర్ ప్రజలను కోరారు. కార్యక్రమంలో డిఇఇ నరేష్, ఎఇ ప్రవీణ్ కుమార్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేశవ్, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్‌ను

కరువు మండలంగా ప్రకటించడమేంటి..?

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

హోళలగుందా, హాలహర్వి, ఆలూరు, పెద్దకడబూరు, పత్తికొండ ,గూడూరు, సి.బెలగల్, దేవనకొండ, తదితర మండలాల్లో కరువు కనపడలేదా అని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. వెంకటేశులు, జి.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కరువు బారిన పడిన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రబిలో నష్టపోయిన మండలాలను కర్నూలు జిల్లాలో 9 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం, అందులో కర్నూలు అర్బన్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 51 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారని, కర్నూలు జిల్లాలో హోలగుందా, హాలహర్వి, ఆలూరు ,పెద్ద కడుబూరు, గూడూరు, సి బెలగల్, పత్తికొండ, దేవనకొండ, తుగ్గలి తదితర మండలాల్లో వేసిన పంటలు నీటి లభ్యత లేక ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వానికి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు, రెవెన్యూ అధికారులకు నిత్యం కరువు బారిన పడే మండలాలు కనపడకపోవడం ఆశ్చర్యమేస్తుందని పేర్కొన్నారు. కర్నూలు అర్బన్‌లో ఎక్కడ పంటలు పండిస్తారో అధికారులే చెప్పాలన్నారు. నష్టపోయిన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించక పోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పుడైనా వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి ఏ మండలాల్లో డ్రైస్పెల్ ఉందో వర్షానికి వర్షానికి మధ్యలో ఉన్న గ్యాప్‌ను బట్టి పంట దిగుబడిని బట్టి నిర్ధారణకు వచ్చి కరువుకు గురైన అన్ని మండలాలను ప్రకటించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఇటువంటి తప్పుడు పద్ధతులు మానుకోకపోతే జిల్లా అధికారుల మీద రైతాంగానికి విశ్వాసం పోతుందని పేర్కొన్నారు.

ఆటిజం - కారణాలు, లక్షణాలు, చికిత్స

- అంతర్జాతీయ ఆటిజం దినోత్సవం
- డాక్టర్ శ్వేతా రాంపల్లి, కన్సల్టెంట్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్, కిమ్స్ హాస్పిటల్.

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్



'ఆటిజం అంటే వయస్సుకు తగ్గ మానసిక ఎదుగుదల లేకపోవడం. ప్రధానంగా పిల్లల్లో కనబడే ఈ వ్యాధి, ఇతరులతో పరస్పర సంబంధం, కమ్యూనికేషన్‌లో తీవ్ర లోపాన్ని కలిగిస్తుంది. గత 15 యేళ్లల్లో ఆటిజం వ్యాప్తి పెరిగింది. ప్రస్తుతం ప్రతి 30 మంది పిల్లల్లో ఒకరికి ఈ వ్యాధి ఉంటుంది.' కర్నూలు **కిమ్స్ హాస్పిటల్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్, కన్సల్టెంట్ డాక్టర్ శ్వేతా రాంపల్లి తెలిపారు.** అంతర్జాతీయ ఆటిజం దినోత్సవం సందర్భంగా ఆమె తెలిపిన వివరాల ప్రకారం...

లక్షణాలు: మాటలలో జాప్యం, స్నేహితులను కలుపుకోవడంలో ఇబ్బంది, కళ్లలోకి నేరుగా చూడలేకపోవడం, ఒకే పనిపై ఆసక్తి, మార్పులను అసహ్యించడం, శరీరభాషలో సమస్యలు.

కారణాలు: స్పష్టమైన కారణం తెలియక పోయినా, జన్యు సమస్యలు, పర్యావరణ మార్పులు, ప్రీమచ్యూరిటీ , మూర్ఛ వ్యాధి వంటి అంశాలు ప్రభావితం చేస్తాయి.

ఏమి చేయాలి?: అటిజం అనుమానం వస్తే సమగ్ర బాల వికాస కేంద్రంలో నిపుణుల ద్వారా పరీక్షలు చేయించాలి. అవసరమైతే ఎంఆర్ఐ స్కాన్, జన్యుపరమైన పరీక్షలు చేస్తారు.

చికిత్స: ప్రవర్తనా చికిత్స ప్రధానమైనది, మందులు కొందరికి అవసరం, తల్లిదండ్రుల శిక్షణ ముఖ్యమైనది. కొత్త చికిత్సలు (విటమిన్ థెరపీ, ప్రత్యేక డైట్) శాస్త్రీయంగా నిర్ధారణ పొందలేదు. అటిజం పూర్తిగా నయం అవుతుందా అన్నప్పుడు తాజా అధ్యయనాల ప్రకారం మూడేళ్లలోపు అటిజం గుర్తించి చికిత్స ప్రారంభిస్తే, 10శాతం పైగా పిల్లల్లో పూర్తిగా కోలుకునే అవకాశం ఉంది.

నిబంధనలు వదిలేసిన ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు

- స్పందించని విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బళ్లారి చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థల బ్యానర్లను తొలగించి నిరసన తెలిపారు. అనంతరం ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర అధ్యక్ష, కార్యదర్శులు అబుబకర్, సాయి ఉదయ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసు కోవడానికి ఎందుకు భయపడుతున్నా రన్నారు. విద్యా సంవత్సరం పూర్తి కాకముందే పెద్ద బ్యానర్లు రోడ్లకు ఇరువైపులా కట్టి అడ్మిషన్లు ప్రారంభ మయ్యాయని ప్రచారం చేస్తుంటే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రూ.లక్షల వేల ఫీజులతో అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవా లన్నారు. ప్రభుత్వ విద్యాశాఖ అధికారులే కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు సహక రిస్తున్నట్టు కని పిస్తుందన్నారు. ప్రభుత్వ విద్యను కాపాడు కోవాల్సిన విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలకు సహకరించడం దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకొని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నగర ఉపాధ్యక్షులు అంజి ,ఆర్యన్, నగర సహాయ కార్యదర్శిలు పృధ్వి నగర నాయకులు నిఖిల్, పవన్, సాయి, ఇమ్రాన్, అశ్వక్షపాయ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

నిరుద్యోగ జ్వాల

- ఖాళీలున్నా భర్తీ లేక యువత ఆగ్రహం.. !
- ఉద్యోగాలు లేక యువత వలసలు, ప్రమాదాలు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై డివైఎఫ్ఐ ధ్వజం.. ! - కర్నూలు యువతకు ఉపాధి కరువు
- ప్రభుత్వాల హామీలు నీటి మూటలేనా?

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లాలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో, బ్యాంకుల్లో వేలాది ఖాళీలు ఉన్నా, వాటిని భర్తీ చేసే ప్రక్రియ ముందుకు సాగడం లేదు. చదువుకున్న యువత ఉపాధి లేక ఇతర నగరాలకు వలస వెళ్తున్నారు...

జిల్లాలో ఆరు లక్షల మంది డిగ్రీ, బీటెక్, బి ఫార్మసీ, బిఎస్‌సి, నర్సింగ్ తదితర కోర్సులలో గ్రాడ్యుయేషన్, ఇంటర్మీడియట్, ఐటిఐ పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం, ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. ఇంజనీరింగ్ ఫార్మసీ చదువుకున్న వాళ్ళు బెంగళూరు, హైదరాబాదు చెన్నై తదితర నగరాలకు వెళ్లి కోచింగ్ తీసుకుంటూ ప్రవేట్ కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 9.76లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. బ్యాంకు లలో వేలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో వివిధ శాఖల్లో 2.36 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వంలోని పెద్దలే అనేక మార్లు తెలిపారు. ఏదో ఒక సాకుతో ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వడంలేదు. ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అంటూ ముఖ్యమంత్రి మొదటి సంతకం మెగా డిఎస్‌సి ఫైలు పై పెట్టారు. నిరుద్యోగులు మాత్రం మొదటి సంతకం మొదటికే మోసమని గ్రహించలేక ఆవేదనతో ఉన్నారు. ఎస్‌సి వర్గీకరణ, టెట్ పేరు చెప్పి కూటమి ప్రభుత్వం 9 నెలలుగా వాయిదా వేస్తుంది. రెండేళ్లుగా ఎదురు చూస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులు పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తే అప్పుడు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించారు. ప్రస్తుతంమేయిన్స్ ఎగ్జామ్ పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.కర్నూలు జిల్లాలో 2500 వరకు ఉపాధ్యాయ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

యువతలో భరోసా కల్పించాలి

కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేసి యువతలో భరోసా కల్పించే విధంగా పాలకుల చేతలు ఉండాలి.ఎన్నికల ముందు యువతకు ఆశలు కల్పించే విధంగా హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత హామీలను విస్మరిస్తున్నారు. జిల్లాకు ఏ మంత్రి వచ్చినా సొల్లు కబుర్లు చెప్పి మసిపూసి మారేడు కాయ చేసిన చందంగా మాటలు ఉంటున్నాయి తప్ప వారి మాటలు ఆచరణలో పెట్టడం లేదు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా కర్నూలు జిల్లా పై ఎంత ప్రేమ ఉందో ఇట్టే అర్థమవుతుంది. పాలకులకు కార్పొరేట్ సంస్థలపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదనీ అర్థమవుతుంది. అందుకేయువత ఐకమత్యంగా పోరాటాలకు సిద్ధం కావాలి.

- నగేష్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి.

రైల్వే వ్యాగన్ నిర్మాణం చేపట్టాలి

కర్నూలు మండలంలో రైల్వే వ్యాగన్ నిర్మాణము చేస్తే పదివేల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయి. రాయలసీమ ఆల్కలీస్ ఫ్యాక్టరీలో లోకల్ వాళ్లకు 85శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే ఉద్యోగాలు ఉపాధి పెరుగుతుంది. ఓర్వకల్ జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి. పట్టణ ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారికి గ్రామీణ ఉపాధి హామీ పథకం లాంటిది పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో పేషెంట్ల సంఖ్యకు అనుగుణంగా హాస్పిటల్ కెపాసిటీని పెంచి, క్యాన్సర్ ఆసుపత్రిని పనిలోకి తీసుకువస్తే ఆస్పత్రి నిర్మాణం పనులను పూర్తిచేస్తే ఉపాధి పెరిగే అవకాశాలు ఉన్నాయి.

- రాఘవేంద్ర, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు.

వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఎన్నికల హామీల్లో భాగంగా గెలిచిన వెంటనే ఉద్యోగాలు భర్తీపై తొలి సంతకం చేసి ఇప్పటివరకు పది నెలలు అయింది. నోటిఫికేషన్ ఇవ్వలేదు. కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కూడా కోర్టులో పెండింగ్ ఉంది. వెంటనే సమస్యను పరిష్కరించి ఉద్యోగాలు భర్తీ చేయాలి. ఎన్నికల ముందు ప్రతి సంవత్సరం డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తానన్నారు ఏమైంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాలలు తెరిచేలోపు కొత్త టీచర్లు స్కూల్లో ఉంటారని చెప్పారు. ఏప్రిల్ ఒకటి వచ్చినా మోక్షం లేదంటే ఎలా స్కూల్లో ఉపాధ్యాయులు ఉంటారని ప్రశ్నించారు. 2.6 లక్షల పోస్టులు వివిధ శాఖల్లో ఖాళీ ఉన్నాయన్నారు. వాటిని వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగు నింపాలి.

- ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు.

ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమలు ఏర్పాటుతోనే వలసలు నివారణ

ఆదోని రెవెన్యూ డివిజన్ పరిధిలో రాష్ట్రంలో ఎక్కడా లేనంత వలసలు ఉంటున్నాయి. దీనికి కారణం ప్రభుత్వం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటులో, ప్రాజెక్టుల నిర్మాణం చేయడంలో జిల్లాపై సవతి తల్లి ప్రేమ కురిపించడమే. ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తానని 2014 ఆగస్టు 15 సిఎం చంద్రబాబు నాయుడు గొప్పలు చెప్పారు. ఇప్పటివరకు ఒక్క పరిశ్రమ ఏర్పాటు చేయలేదు. ఒక్క సాగునీటి ప్రాజెక్టును నిర్మించలేదు. వలస పోతే తప్ప బ్రతకలేని దుర్భర పరిస్థితిలో ఈ ప్రాంతంలోని యువత ఉంది. డిగ్రీలు, పీజీలు చదివినా ఉపాధి హామీ, వలస కూలీగా మారక తప్పడం లేదు. పాలకులు చిత్తశుద్ధితో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ముఖ్యంగా నిరుద్యోగ భృతి హామీని వెంటనే అమలు చేయాలి.

- వీరేష్, డివైఎఫ్ఐ ఆదోని పట్టణ అధ్యక్షులు.

ఘనంగా సోమిశెట్టి జన్మదిన వేడుక

- టిడిపి అధ్యక్షులు తిక్కారెడ్డి, మంత్రి టిజి. భరత్ హాజరు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడాఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలను మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్, జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు కేక్ ను కట్ చేసి ఒకరికొకరు పంచుకుని, శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నగర్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, నంద్యాల నాగేంద్ర, ధరూర్ జేమ్స్, అబ్బాస్, స్వామి రెడ్డి పరమేష్, సోమిశెట్టి నవీన్, సత్రం రామక్రిష్ణుడు, పి.హనుమంతరావు చౌదరి, పేరపోగు రాజు, నంది మధు, మహేష్ గౌడ్, బొగ్గుల బజారన్న, మల్లెల పుల్లా రెడ్డి, బేతం క్రిష్ణుడు, పుల్లయ్య, అఖిల్, ఉమర్ బాష, ప్రవీన్, ప్రకాష్, లక్ష్మి దేవి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి

పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు మండలం మామిదల పాడు గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. వృద్ధులకు, వితంతువులకు రూ.4000, వికలాంగులకు రూ.6000 లబ్ధిదారుల ఇంటికి వెళ్లి, వారిని ఆప్యాయంగా పలకరించి పెన్షన్ పంపిణీ చేశారు. స్థానికంగా ఉన్న ఎంపిపి పాఠశాలను సందర్శించి అక్కడ వండుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల హాజరు పట్టికను పరిశీలించారు. స్థానికంగా ఉన్న సచివాలయాన్ని సందర్శించి సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. స్థానికంగా ఉన్న ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కరిస్తానని చెప్పారు. సచివాలయ సిబ్బంది, టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

పింఛన్లతో ఆర్థిక భరోసా

-టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

పింఛన్లతో ప్రభుత్వం లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సౌలహళ్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ఒకటో తేదీ ఆదివారం వస్తే మూడో తేదీ పెన్షన్ పంచే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం చంద్రబాబు చొరవతో అలాంటి సమస్య లేకుండా 1వ తేదీ సెలవు వచ్చినా కూడా ఒక్కరోజే ముందే డబ్బులు అధికారుల ద్వారా పెన్షన్ పంపిణీ చేసి లబ్ధిదారు కళ్ళలో

-పింఛన్ పంపిణీ చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి

కూటమి ప్రభుత్వం ఆనందం చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, మాలపల్లి లక్ష్మన్న, మాలపల్లి వీరేష్ బోయ శివరాముడు పాల్గొన్నారు.

తప్ప తాగి భార్యపై గొడ్డలితో దాడి

ప్రజాశక్తి - ఆలూరు

మండల పరిధిలో అగ్రహారం గ్రామంలో భార్య కవితపై భర్త ఈరన్న తప్ప తాగి మంగళవారం గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరించిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు అగ్రహారం గ్రామ సమీపంలోని సొంత హోటల్లో భార్య పై గొడ్డలితో దాడి చేసినట్లు తెలిపారు. ప్రేమించి పెళ్లాడిన ఈ దంపతులకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా మద్యం తాగుతూ ఉండగా ఇంట్లో తరచు గొడవ పడుతు ఉండేవారని, సాయంత్రం తప్ప తాగి వచ్చి భార్య పై విచక్షణ రహితంగా గొడ్డలితో దాడి చేసాడు. స్థానికులు అడ్డుకొని అతనిని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పాజెప్పారు. గాయపడిన భార్య కవితను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కొరకు వైద్యులు బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డాక్టర్‌కు సిఐటియు ఆధ్వర్యంలో మెమొరాండం ఇస్తున్న సిఐటియు నాయకులు

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కౌతాళం

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు గౌరవ అధ్యక్షులు మల్లయ్య కోరారు. మంగళవారం కౌతాళం మండలం బదినేహాలు ప్రభుత్వ హాస్పటల్‌లో ఆశా డే సందర్భంగా ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో డాక్టర్ మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్ల సేవలను గుర్తించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పలుమార్లు ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చామని ఇప్పటికైనా స్పందిచక పోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

ఇసుక తరలింపులో తహసీల్దార్ వివక్ష

టిడిపి నాయకులు రాఘన్న

ప్రజాశక్తి-మంత్రాలయం

తుంగభద్ర నది నుంచి ఇసుక తరలింపులో తహసీల్దార్ ఎస్.రవికి వివక్ష చూపడం తగదని టిడిపి నాయకులు కలుదేవకుంట రాఘన్న ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి లు తుంగభద్ర నది నుంచి ఇసుక రవాణా చేసుకోవచ్చని చెబుతున్నారు. కానీ తుంగభద్ర నదికి రీచ్ పాయింట్ లేదని తుంగభద్ర నది నుంచి ఇసుక తరలింపును అడ్డుకుంటున్నారని ఇదే అందరికీ వర్తించే విధంగా చర్యలు ఉండాలన్నారు. కేవలం కొందరి ట్రాక్టర్లు మాత్రమే అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిపై చర్యలు లేవని విమర్శించారు. విఆర్ఒలు విఆర్ఎల పట్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తిట్లు తిట్టడం జరుగుతోందని తెలిపారు. ఇసుక తరలింపు పై వివక్ష చూపుతున్న తహసీల్దార్ పై చర్యలు తీసుకోవాలని కోరారు.

మంచాలమ్మ కు విశేష పూజలు

బంగారు హారాలతో విశేష అలంకరణ

ప్రజాశక్తి మంత్రాలయం

తుంగభద్ర నది తీరాన వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలోని గ్రామ దేవత మంచాలమ్మకు బంగారు వెండి ఆభరణాలతో విశేష అలంకరణ చేశారు. మంగళవారం అమ్మ వారికి ప్రత్యేక విశిష్టమైన వారం కావడంతో అమ్మ వారి అర్చకులు నరేంద్ర స్వామి మంచాలమ్మకు వేకువ జామున నుండే విశేష పూజలు నిర్వహించారు. అందులో భాగంగా పసుపు, కుంకుమతో అభిషేకం చేపట్టారు. అనంతరం విశేష క్షీరాభిషేకం నిర్వహించారు. అమ్మ వారికి విశేష పుష్పాలతో, సువర్ణ హారాలతో ఆకర్షణీయంగా చూడముచ్చటగా అలంకరించారు. అనంతరం శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామిజీ శ్రీమన్ మూలరామ పూజ కార్యక్రమం పూర్తి చేసుకోని నేరుగా అమ్మవారి గర్భాలయానికి చేరుకొని విశేష పుష్పాలను అమ్మవారికి సమర్పించారు. అనంతరం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామిజీ విశేష మహా మంగళ హారతులు చేపట్టారు. శ్రీ మఠం అధికారులు, వరధేంద్ర స్వామి, నరేంద్ర స్వామి, అమ్మవారి ఆలయ అధికారి కౌతాలప్ప స్వామి, పూజ నిర్వాహకులు రవి గౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నిరసనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఆదోని

ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు జిల్లా ఫ్యాప్టో ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ భాస్కర్, ఎస్టియు సహాధ్యక్షులు సి.నాగరాజు, యూటిఎఫ్ బాధ్యు యులు నరసయ్య గౌడ్, ఎపిటీఎఫ్ భాధ్యులు తిక్కస్వామి కోరారు. ఆదోనిలోని యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పిఎస్, జిపిఎస్ లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలని, 12వ పిఆర్‌సికి కమీషన్ ను నియమించాలని, ఈలోగా 30 శాతం మధ్యంతర భతిని ఇవ్వాలని,11వ పిఆర్సి బకాయిలను, డిఏ బకాయలను, సరెండర్ లీవు బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని, కారుణ్య నియామకాలు ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఫ్యాప్టో కార్యకర్తలు అధిక సంఖ్యలో

అభివాదం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

పాల్గొని విజయవంతం చేయయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాల బాధ్యులు ప్రేమ్ కుమార్, జి.వీరచంద్ర యాదవ్, సుంకన్న, రాఘవేంద్ర, నాగేంద్ర, ముత్తన్న, భీమరాజు పాల్గొన్నారు

మిరప రైతు కంటకన్నీరు

- దక్కని గిట్టుబాటు ధర - ఆవేదనలో రైతులు

ప్రజాశక్తి - నందవరం

ఈ సంవత్సరం మిరపకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతన్నకు కన్నీరు తప్పడం లేదు. సరైన వర్షాలు లేక పండిన కొద్దిపాటి పంటకు కూడా గిట్టుబాటు ధర రాక రైతులు ఆందోళనకు చెందుతున్నారు. పండించిన పంటను తక్కువ రేటుకు అమ్ముకోలేక, అప్పుల భారం ఎక్కువై పంటను గోడన్‌లలో దాచుకోలేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

రైతుల బాధలను పట్టించుకోని ప్రభుత్వం

- నాగేష్, కనకవీడు గ్రామం

మిరప రైతుల బాధలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. మూడెకరాలలో రూ.4 లక్షల పెట్టుబడితో మిరప సాగు చేశాం. మిరప అమ్మకానికి గుంటూరు వెళ్లాం. అక్కడ రైతుల పరిస్థితి దయనీయం. ఒక క్వింటాం రూ.7 వేలకు అమ్మాం. గిట్టుబాటు ధర కల్పించాలని అక్కడ మార్కెట్‌లోను, రోడ్లపైన ధర్నాలు నిర్వహించారు. ధర్నాలు చేసిన ఎవ్వరు స్పందించలేదు. చాలా ఘోరంగా అవమానించి పంపించారు. రైతుల పరిస్థితి చాలా ఘోరంగా తయారైంది. మూడు ఎకరాలకు 42 క్వింటాలు దిగుబడి వచ్చింది. వచ్చిన డబ్బులు పెట్టుబడులకు సరిపోక అప్పు మిగిలింది.

పొలాల్లోనే నిలువ ఉంచిన మిరప పంట

మండలంలో దాదాపు 5వేల ఎకరాలలో రైతులు మిరప పంటను సాగు చేశారు. సరైన వర్షాలు లేక, వైరస్ బారిన పడి మిరప దిగుబడి పూర్తిగా తగ్గింది. ఎకరాకు 14 క్వింటాలు కూడా రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వచ్చిన కొద్దిపాటి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడం లేదని వాపోతున్నారు. పగలు, రాత్రి కష్టపడినా ధరల పతనంతో రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోతున్నారు. తెంచిన పంటను కల్లాలలో అరావేసి ధరలు లేక కల్లాలలో రైతులు పంటను చూస్తు దిగాలుగా కూర్చున్నారు. మిరప పంటను తక్కువ రేటుకు అమ్ముకోలేక, గోడౌన్‌లలో నెలలు తరబడి దాచుకోలేక అప్పుల భారంతో రైతన్న అయోమయంలో ఉన్నారు.

పంచాయితీ కార్యదర్శిపై కేసు అన్యాయం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామపంచాయతీ కార్యదర్శి రాముడుపై కేసు నమోదు చేయడం అన్యాయమని ఏపీ గ్రామ పంచాయతీ కార్యదర్శుల యూనియన్ జిల్లా కార్యదర్శి గురు స్వామి, ఏపీ గ్రామ పంచాయితీ అసోసియేషన్ కోశాధికారి శేషన్న, ఉపాధ్యక్షులు వేణుగోపాల్ రాయలసీమ జోనల్ కార్యదర్శి శివ శంకర్ సింగ్, జిల్లా నాయకుడు జి రాముడు, మునిస్వామి ఖండించారు. పంచాయతీ కార్యదర్శి రాముడుపై నమోదు అయిన కేసు కొట్టేయాలని మంగళవారం ఏఎస్ఐ శ్రీనివాసులకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తెర్నేకల్ గ్రామంలో నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ స్థల కేటాయింపుపై మండల అధికారుల ఆదేశాల మేరకు గత నెల 28వ తేదీన గ్రామ సభను ఏర్పాటు చేశారన్నారు. మధ్యాహ్నం గ్రామసభ అయిపోవడంతో సాయంత్రం గ్రామసభ టెంటు తొలగించడంలో ప్రతాప్ అనే యువకుడు ప్రమాదవశాత్తు కరెంటు షాకుతో మరణించాడని, దీనికి పంచాయతీ కార్యదర్శిని బాధ్యుడిని చేసి కేసు నమోదు చేయడం విచారకరమన్నారు. ప్రమాదవశాత్తు



దేవనకొండ పోలీసులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జరిగిన వాటికి కార్యదర్శిని బాధ్యుడిని చేసి కేసులో ఇరికించడం ఏమాత్రం తగదని ఖండించారు. పంచాయతీ కార్యదర్శిపై నమోదు చేసిన కేసును కొట్టేయకపోతే పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన ఉదతం చేస్తామని వారు హెచ్చరించారు.

దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలి

- డివిఎంసి సభ్యులు కాకర్ల శాంతికుమార్

ప్రజాశక్తి -దేవనకొండ

కర్నూలు జిల్లాలో అత్యంత వెనకబడిన దేవనకొండను కరువు మండల జాబితాలో చేర్చాలని డివిఎంసి సభ్యులు కాకర్ల శాంతి కుమార్ మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో సాగుచేసిన శనగ, వేరుశనగ, జొన్న, మిరప పంటలు వర్షాభావ పరిస్థితుల్లో దిగుబడి గణనీయంగా తగ్గిపోయి తీవ్రంగా నష్ట పోయారన్నారు. బోరు బావుల ద్వారా వేరుశనగ పంట 4098 ఎకరాలలో, శనగ పంట1200ఎకరాలలో, జొన్న1650 ఎకరాలలో సాగు చేశారన్నారు. పంట దిగుబడులు లేక పూర్తిగా దెబ్బ తిన్నది దానిద్వారా రైతులు నష్టపోయారన్నారు మరోసారి పునఃపరిశీలన చేసి దేవనకొండ కరువు మండల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న శాంతికుమార్

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానం

- ప్రిన్సిపల్ సౌజన్య

ప్రజాశక్తి - చిప్పగిరి

మండల కేంద్రమైన చిప్పగిరిలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో చేరేందుకు బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ సౌజన్య తెలిపారు. మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేజీబీవీలో ఆరవ తరగతికి సంబంధించిన 40 సీట్లుకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈనెల 11 వరకు దరఖాస్తు చేసుకోవడానికి

గడువు ఉందన్నారు. మిగతా తరగతులలో ఖాళీగా ఉన్న వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు. ఈ అవకాశమును కింద స్థాయి బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు కేజీబీవీ సిబ్బందిని సంప్రదించవచ్చు అన్నారు. ఎంపికైన బాలికల జాబితా ఏప్రిల్ 21న విడుదల చేస్తామని, ఎంపికైన బాలికలకు మొబైల్ కాల్స్ లేదా మెసేజ్ ద్వారా సమాచారాన్ని అందజేస్తామన్నారు.

యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గంలోకి అవినాష్ శెట్టి

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి ఎం.అవినాష్ శెట్టి మంగళవారం యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడుగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి మంగళవారం కర్నూలులోని తన కార్యాలయంలో అవినాష్ శెట్టిని ఘనంగా సత్కరించారు. లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర అభివృద్ధి కోసం అవినాష్ శెట్టి చేస్తున్న కృషి వెలకట్టలేనిదని అన్నారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడుగా దేశవ్యాప్తంగా యోగ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నూతన కమిటీ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని అన్నారు. 2029 మార్చ్ వరకు కమిటీ కొనసాగుతుందన్నారు. అనంతరం అవినాష్ శెట్టి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌తో పాటుపాటు భారతదేశ వ్యాప్తంగా యోగ క్రీడా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా రన్నారు. ప్రతిభగల యువ యోగ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు. తనను ప్రోత్సహించిన ఏషియన్ యోగ సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్ అగర్వాల్, నూతన అధ్యక్షుడు అనిరుద్ గుప్తా, ప్రధాన కార్యదర్శి అభినవ జోషి, ఉపాధ్యక్షులు మనోహర్ కుమార్, అధ్యక్షుడు సింహరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు వర్మలకు ప్రత్యేకంగా కృ తజ్ఞతలు తెలిపారు. అవినాష్ బాధ్యత స్వీకరణ పట్ల జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కెఇ జగదీష్ కుమార్, శ్రీనివాసులు, కార్యనిర్వక కార్యదర్శి సునీల్ కుమార్, సభ్యులు డాక్టర్ రుద్ర రెడ్డి, ఈశ్వర్ నాయుడు, జిల్లా యోగ సంఘం సభ్యులు సాగర్, సాయికృష్ణ, ముంతాజ్ బేగం,నాగరాజు లు హర్షం వ్యక్తం చేశారు.

30 లోగా ఇకెవైసి చేయించుకోండి

ప్రజాశక్తి-మద్దికేర : రేషన్ కార్డు వినియోగదారులందరూ ఈనెల 30వ తేదీలోగా ఇకెవైసి ప్రక్రియ పూర్తి చేసుకోవాలని తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ వెంటనే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త కార్డుల జారీ సమయంలోనే కుటుంబ సభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డుల కోసం ఆప్షన్లు ఇస్తామని తెలిపారు. క్యూఆర్ కోడ్ లాంటి భద్రతా ఫీచర్లతో కొత్త రేషన్ కార్డులు జారీ అవుతాయని అన్నారు. ఇకెవైసి పూర్తి అయిన తర్వాత ఎంతమందికి కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలో స్పష్టత వస్తుందని అన్నారు.

రైతుల పంట రుణాలు మాఫీ చేయాలి

ప్రజాశక్తి-మద్దికేర :రైతులు బ్యాంకులలో తీసుకున్న అన్ని రకాల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజాసాహెబ్ డిమాండ్ చేశారు. ఈనెల 4న కర్నూల్ లో జరిగే జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన జీపు జాతాను మద్దికేర మండలం ఎం.అగ్రహం, పెరవలి, బసినేల్లి,మదనంతపురం గ్రామాల్లో ప్రచారం చేశారు. సిపిఐ మండల కార్యదర్శి నాగరాజు, నియోజకవర్గ కార్యదర్శి సురేంద్ర కుమార్, గౌరవ అధ్యక్షులు కారన్న, మండల కార్యదర్శి సిద్ద లింగప్ప, నాయకులు నాగిరెడ్డి, హనుమన్న కోదండరాముడు, బుజ్జన్న సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రాతి దూలం విజేత రేమట వృషభాలు

దాత పవన్ సాగర్ బహుమతి రూ 50 పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు రైతు సంఘం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలలో భాగంగా మూడో రోజు కల్లూరు రైతు సంఘం ఆధ్వర్యంలో ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. గత 35 సంవత్సరాల నుంచి ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈపోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రం నుంచి 13 జతలు వృషభాలతో రైతులు పాల్గొన్నారు. మొదటి స్థానంలో నిలిచిన కర్నూలు జిల్లా రేమట గ్రామానికి చెందిన రైతు చిన్న గిడ్డయ్య వృషభాలు 4116 అడుగుల దూరం లాగి ప్రథమ విజేతగా నిలిచాయి దాతలు పవన్, సాగర్ వారి తండ్రి బి.ఈశ్వరప్ప జ్ఞాపకార్థం రూ 50,000 విజేతకు అందజేశారు. రెండవ స్థానంలో డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన రైతు షేక్ మైమున్ బాషా వృషభరాజములకు దాత ద్వితీయ బహుమతి వాడాల గణేశ్వర రెడ్డి జ్ఞాపకార్థం వాడలా రామిరెడ్డి రూ.45 వేలు, మూడో స్థానంలో నిలిచిన తెలంగాణ రాష్ట్ర నాగర్ కర్నూలు జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వరరావు వృషభరాజములకు తృతీయ బహుమతి దాత డోగూరు రాముడు రూ.40 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన తెలంగాణ రాష్ట్ర పచ్చర్ల గ్రామానికి చెందిన రైతు రాజేశ్వర రెడ్డి వృషభరాజములకు నాలుగో బహుమతి దాత కురువ మల్లయ్య రూ.30 వేలు, ఐదు స్థానంలో నిలిచిన కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం హచ్ కైరవాడి

గ్రామానికి చెందిన రైతు లక్ష్మన్న వృషభరాజములకు ఐదో బహుమతి దాత డోగూరు వెంకటేశ్వర్లు రూ 25 వేలు, ఆరవ స్థానంలో నిలిచిన గద్వాల జిల్లా మంగంపేట గ్రామానికి చెందిన రైతు వీరాంజనేయులు వృషభరాజములు ఆరో బహుమతి దాత ఎస్.మాలిక్ బాష రూ 20 వేలు, ఏడు స్థానంలో నిలిచిన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం దిక్కులేరు గ్రామానికి చెందిన రైతు డాక్టర్ రషీద్ వషభరాజములకు ఏడో బహుమతి దాత మీసాల తిమ్మన్న కుమారులు పదివేల రూపాయలు అందజేశారు. గ్రామ పెద్దలు లక్ష్మీ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు లక్ష్మీ రెడ్డి, కల్లూరు పెద్దలు రామకృష్ణ, మహేశ్వర రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల నీటి తొట్ల నిర్మాణానికి భూమి పూజలు

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోని కొత్తకోట, యనగండ్ల, ఈర్లదిన్నె, బ్రాహ్మణ దొడ్డి, సి బెళగల్, చింతమాను పల్లి, పోలకల్ వంటి గ్రామాల్లో పశువులకు నీటి తొట్లు ఏర్పాటు చేసే క్రమంలో ఎంపిడిఒ రానెమ్మ, ఎపిఒ రామన్న, ఇసి రంగస్వామిలు మంగళవారం భూమి పూజ చేశారు. ఇందులోనే సి బెళగల్ లో నాయకులు ఈరన్న గౌడ్, పోలకల్ చిన్న తిమ్మప్ప తదితరులు పాల్గొనగా ఎంపిడిఒ రాణెమ్మ మాట్లాడారు. వేసవి సందర్భంగా పశువులకు ఇంటి నుండి వెళ్లి పోయాక దాహం తీర్చుకోవడం కష్టమని అన్నారు. అందుకే పాడి సంఖ్య ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ఈ నీటి తొట్లు నిర్మించడానికి ప్రభుత్వం దృష్టి సారించిందని అన్నారు. కనపరచిన గ్రామాలకు రూ 34 వేల వరకు ప్రభుత్వం మంజూరు చేసిందని సకాలంలో పూర్తి

చేసి పశువులకు దాహం తీర్చాల్సిన అవసరం మనకుందని అన్నారు.

డిఎస్ఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్ మంగళవారం కర్నూలు నగరంలో వాహనాలు , రేషన్ షాపులలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఎండియు ఆపరేటర్ నెంబర్ 62 మహేష్‌కు చెందిన ఎండియు వాహనంలో తనిఖీ సమయంలో 245 కేజీల బియ్యం , 82 కేజీల చక్కెర ప్యాకెట్లు నిల్వలలో తక్కువగా ఉండడం పరిశీలించారు. వెంటనే సదరు ఎండియు ఆపరేటర్ పై 6-ఎ కేసు నమోదు చేశారు.ేంషన్ షాప్ నంబర్ 53 డీలరు అధికారులు సమాచారమిచ్చిన షాపుకు రాకపోవడంతో వెంటనే షాపును డిఎస్ఒ సీజ్ చేశారు. అనంతరం డిఎస్ఒ మాట్లాడుతూ ఎవరైనా బియ్యం అక్రమ రవాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు , కర్నూలు నగర సహాయ సరఫరాల అధికారి రామాంజనేయరెడ్డి ,ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి కూడా ఉన్నారు.

90 శాతం పింఛన్ల పంపిణీ

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని 16 గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఒకే రోజున 90 శాతం పూర్తయిందని ఎంపీడీవో అల్లా బకాష్ తెలిపారు. మంగళవారం మండల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వర్లు బాగా పనిచేసినందున ఒకే రోజున పింఛన్ల పంపిణీ కార్యక్రమంను 90 శాతం పూర్తి చేశామన్నారు. అందుబాటులో లేని వారు మాత్రమే మిగిలి ఉన్నారని, వారికి కూడా రెండవ తేదీన అందజేస్తామన్నారు. ప్రభుత్వం త్వరలో అర్హత ఉన్న వారి నుంచి దరఖాస్తులు తీసుకోవడానికి అవకాశం కల్పిస్తుందన్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి-చిప్పగిరి

చిప్పగిరి మండలం పరిధిలోని నంచర్ల గ్రామానికి చెందిన గొర్రెల కాపరి రామాంజని(29) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు స్థానికులు వివరాల మేరకు... కాపరి రామాంజి మేకలు, గొర్రెలు పెంచి వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించేవాడు. రోజు మాదిరిగానే ఉదయం గొర్రెలను మేకలను మేత కోసం పొలాల్లోనికి తీసుకెళ్లాడు. మేకలు గొర్రెలను నీళ్లు తాపడానికి కసాపురం వద్ద ఉన్న ఓ బావి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోవడంతో ఈత రాని రామాంజని నీటిలో మునిగి చనిపోయాడు. పొల్లాలో పనిచేస్తున్న రైతులు గమనించి బంధువులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన వెళ్లి బావిలో గాలించారు. మృతి చెందిన రామాంజని శవాన్ని బయటకు తీసి కసాపురం పోలీసులు, రెవెన్యూ అధికారులు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలాన్ని చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. రామాంజిని, కృష్ణవేణి దంపతులకు ఇద్దరు సంతానం. మహేష్(7), పార్థు(5) నంచర్ల పాఠశాలలో చదువుతున్నారు. కుటుంబ సభ్యులంతా కూడా దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

పింఛన్లతో లబ్ధిదారులకు చేయూత

ప్రజాశక్తి - హొలహర్వి

మండలంలోని నిట్ర వట్టి గ్రామంలో మంగళవారం టిడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పెన్షన్లు అందించడం వల్ల లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎపి ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. త్వరలో మరిన్ని సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జ్ పాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉమాకాంత్ స్వామి, సర్పంచులు గాదిలింగప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.